



మీ సేవ పేరుతో నకిలీ వెబ్‌సైట్

మహబూబాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మీసేవ తెలంగాణ పేరుతో ఓ నకిలీ వెబ్‌సైట్‌ను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రారంభించినట్లు డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అది మన మీసేవ వెబ్‌సైట్‌కి ప్రతిరూపం, కొత్త కేంద్రాల కేటాయింపుల కోసం డిపాజిట్లు కూడా సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నకిలీ వెబ్‌సైట్‌ను గుర్తించి వీఎల్ఈలు, పౌరులందరికీ నకిలీ వెబ్‌సైట్‌ను క్లిక్ చేసి లాగిన్ చేయొద్దని సూచించారు. నకిలీ వ్యక్తులకు ఎలాంటి మొత్తాన్ని చెల్లించవద్దని చెప్పారు. మేము వీలైనంత త్వరలో నకిలీ వెబ్‌సైట్‌ను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.



కేయూ విద్యార్థులందరికీ హాస్టల్ వసతి

గతంలోలా రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేవు..

- అదనంగా రెండు హాస్టళ్లు, మెస్‌ల ఏర్పాటు
- నిధుల కేటాయింపు.. నిర్మాణాలకు సన్నద్ధం
- ఈ సంక్రాంతికి విద్యార్థులకు అందుబాటులోకి
- వర్సిటీ క్యాంపస్ విద్యార్థుల హర్షాతిరేకాలు

7



గాంధీనగర్‌లోని గురుకులంలో విద్యార్థినులతో వ్యాయామం చేస్తున్న సీతక్క

విద్యార్థినులు ఇష్టమైన రంగాల్లో రాణించాలి

- పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క
- క్రీడాకారిణి ప్రణవికి ఆర్థిక సాయయం

- వివరాలు 6లో

శ్రీవీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.39 లక్షలు

- వివరాలు 8లో



సవాళ్లు.. వివాదాలు!

ఉమ్మడి జిల్లాలో మిశ్రమ రాజకీయాలను మిగిల్చిన 2024

అధికారం కోల్పోయి.. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న 'గులాబీ' పార్టీ

- బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన కడియం, అరూరి, అజ్మీరా, సుధారాణి, సారయ్య, మార్నేని
- కుండువా మార్చిన అరూరి, సీతారాంనాయక్‌కు కలిసిరాని కాలం
- కాషాయం టికెట్‌పై ఎంపీగా పోటీ చేసి ఓడిన బీఆర్ఎస్ మాజీ నేతలు
- పార్టీ మారి.. తొలి ప్రయత్నంలోనే ఎంపీగా నెగ్గిన కడియం కావ్య
- చర్చనీయాంశమైన తాటికొండ యూటర్న్..
- కోపంతో కారు దిగి.. దారిలేక మళ్లీ కారెక్కిన రాజయ్య
- ఎర్రబెల్లిని టెన్షన్ పెట్టిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం
- కాంగ్రెస్‌లో అసంతృప్తి.. పలు వివాదాల్లో కొండా దంపతులు

7

2024.. ఎన్నో రాజకీయ మార్పులు.. వివాదాలు.. సవాళ్లకు వేదికగా నిలిచింది. కొందరు నేతలకు కలిసొస్తే మరికొందరికి చేదు అనుభవాలను మిగిల్చింది. పలువురు కీలక నేతలు అప్పటి వరకు తాము వేసుకున్న పార్టీ కండువాలను మార్చారు. కారు దిగి కాషాయ గూటికి కొందరు చేరితే.. ఇంకొందరు 'స్నేహ'హస్తం' అందుకున్నారు. కమలం గూటికి చేరిన అరూరి, సీతారాంనాయక్‌కు చేదు మిగిలితే.. కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన కడియం కావ్య 'విజయ'లక్ష్యాన్ని చేరుకున్నారు. తద్వారా పార్టీ మారి కడియం శ్రీహరి తన ఇమేజ్‌ను నిలబెట్టుకున్నారు. ఇక ఓరుగల్లులో కాంగ్రెస్‌లో నెలకొన్న అసమ్మతి మంత్రి కొండా సురేఖను టెన్షన్ పెట్టగా.. సినీ హీరోపై ఆమె చేసిన వివాదాస్పద వాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు మాజీ మంత్రి ఎర్రబెల్లిని ఆందోళనకు గురి చేస్తే.. మరోనేత రాజయ్య తొలుత గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. పరిస్థితులు అనుకూలించక.. మళ్లీ అదే పార్టీలో చేరారు. ముఖ్యంగా ఏడాది కాలంగా గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు ఓరుగల్లు గడ్డపై పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు తమ ముందున్న అభివృద్ధి సవాళ్లను స్వీకరిస్తూ ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా చూసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రజల కోసం సీపీఐ పోరాటం

జిల్లా కార్యదర్శి విజయసారథి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల దేశ ప్రజల కోసం పోరాడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)దని జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ వీరభవన్‌లో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సీపీఐ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి, ప్రసంగించారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో దేశప్రజల శ్రేయస్సు కోసం ఆవిర్భవించిన సీపీఐ నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. నాడు బ్రిటీష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఘనచరిత్ర సీపీఐదని చెప్పారు. భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ ప్రజలకు 10 లక్షల ఎకరాలను సీపీఐ పంచిందని చెప్పారు. అంతటి ఘన చరిత్ర కలిగిన సీపీఐని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, శ్రావణ్, ఫాతిమా, మహిమూద్, రమేష్, వేణు, చిరంజీవి, అశోక్, పాల్, రాజకుమారి, శంకర్, భాగ్యమ్మ, పద్మ, రాణి పాల్గొన్నారు.

- మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట సీపీఐ వంద వసంతాల ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ కార్యదర్శి మారగాని బాలకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్దుల్ రషీద్, లింగన్న, రాములు, యాకన్న, వీరేందర్, వెంకన్న పాల్గొన్నారు.
- కురవి మండలం బలపాలలో సీపీఐ పతాకాన్ని జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు ఆవిష్కరించగా, సీనియర్ నాయకుడు వెంకటనారాయణ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామగాని రవి, బత్తుల వెంకటేశ్వర్లు, ఎం.పాపయ్య, బోళ్ల వీరన్న, సతీష్, మాలోతు లచ్చిరాం, మంగీలాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో ప్రసంగిస్తున్న విజయసారథి



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న వీపీ సాను

డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలి

- తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను

కురవి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యావిధానం పేరుతో బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో ఈ విధానాన్ని అమలు చేయొద్దని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను డిమాండ్ చేశారు. కురవిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడం వల్ల డ్రాప్ అవుట్స్ పెరిగిపోతాయని, పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమై బాలకార్మికులుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 63 సంవత్సరాల తర్వాత 2009లో విద్యాహక్కు చట్టం తెచ్చారని, అందులో 8వ తరగతి వరకు ఫెయిల్ చేయరాదని నిబంధన సెక్షన్-16లో ఉందన్నారు. డిటెన్షన్‌కోసం విద్యాహక్కు చట్టాన్ని బీజేపీ మార్పుచేసి ప్రైవేట్, కార్పొరేట్ వర్గాలకు చదువు అమ్ముకునేలా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖకు తక్షణమే మంత్రిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫుడ్‌పాయిజన్ ఘటనలు గురుకులాల్లో రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయాలని, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిశోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్వీనర్ పట్ల మధు, జిల్లా కోకన్వీనర్‌లు సూర్యప్రకాష్, గంధసిరి జ్యోతిబసు, నాయకులు సింహాద్రి, గుండ్ల రాకేష్, మురళి, మౌలాన, మహేష్, వినయ్ పాల్గొన్నారు.

కొనుకోలు కేంద్రంలో.. మొలకెత్తిన ధాన్యం

- అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఇబ్బందులు

తొర్రూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో.. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం బస్తాల్లోని వడ్లు మొలకెత్తాయి. రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొర్రూరు మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వడ్లను విక్రయించడానికి ఆయాకేంద్రాల్లో రైతులు తమ ధాన్యం తీసుకువచ్చి, ఆరబెట్టారు. అయితే కేంద్రాల్లోని నిర్వాహకు లు మ్యాచ్చర్ వచ్చినా.. ధాన్యం కాంటాలు నిర్వహించి, తరలించడంలో జాప్యం చేశారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కొంత తడిసి, ముద్దయ్యాయ ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మాపురం గ్రామానికి చెందిన సర్వస్వతి అనే మహిళా రైతు ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం తూర్పాల పట్టి ఆరబెట్టారు. మ్యాచ్చర్ రావడంతో 150 బస్తాలు కాంటాలు నిర్వహించి, తరలించ లేదన్నారు. దీంతో అకాలంగా కురిసిన వర్షాలకు ధాన్యం మొత్తం తడిసి మొలకెత్తాయని బాధిత మహిళా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గురువారం తొర్రూరు రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి చింతలపల్లి, అమ్మాపురం, ఖానాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. రైతుల కష్టపడి పండించిన ధాన్యం కాంటాలు నిర్వహించ డానికి, కాంటాలు అయిన బస్తాలను తరలించ డానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. తడిసిన వడ్లను ప్రభుత్వం ఎలాంటిషరతులు లేకుండా కొనుగోలు చేసి, మద్దతు ధరతో పాటు బోనస్ అందించాలని కొత్త వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.



అమ్మాపురంలోని కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం బస్తాలు

33.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 33.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 2.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొత్తగూడలో 4.2 మి.మీ, బయ్యారంలో 1.6, కురవిలో 0.8, మహబూబాబాద్‌లో 2.2, కేసముద్రంలో 1.2, నెల్లికుదురులో 2.6, నర్సింహులపేటలో 3.4, చిన్నగూడూరులో 2.4, మరిపెడలో 1.4, దంతాలపల్లిలో 2.0, తొర్రూరులో 6.8, పెద్దవంగరలో 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణకు మార్కింగ్!

- భారీగా దుకాణాలు, ఇళ్లకు నష్టం
- 50 ఫీట్లకు తగ్గించాలని దుకాణాదారుల విజ్ఞప్తి

కేసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్ సెంటర్ నుంచి విలేజి దర్గా వరకు రోడ్డు విస్తరణ మార్కింగ్‌తో దుకాణాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం సంబంధిత రోడ్డు కాంట్రాక్టు సిబ్బంది 80 అడుగుల వెడల్పుతో కొలతవేసి మార్కింగ్ చేశారు. రోడ్డు మధ్య భాగం నుంచి ఇరువైపులా 40 అడుగులు కొలత వేస్తూ దుకాణాలు, ఇళ్లను ఎన్ని ఫీట్లు వెనుకకు తొలగించాలనే విషయాన్ని గుర్తులు రాశారు. అంబేద్కర్ సెంటర్, మార్కెట్ సమీపంలో చాలా దుకాణాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. కేసముద్రం విలేజిలో చాలా ఇళ్ల ముందు ఒక గదిని కోల్పోతున్నారు. ఈ రోడ్డు విస్తరణ మంజూరైన నాటి నుంచి వంద అడుగులు తొలగిస్తారని తీవ్ర ఆందోళనతో ఉన్న దుకాణాదారులు కొద్దిరోజుల క్రితం ప్రజాప్రతినిధులకు, అధికారులతో పాటు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి వినతిపత్రాలను అందజేశారు. ఈ క్రమంలో ఎవరి ఇళ్లకు, దుకాణాలకు నష్టం కలుగకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వారికి మార్కెట్ చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా 80 అడుగుల వెడల్పుతో మార్కింగ్ చేయడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలా దుకాణాలు పూర్తిగా పోతుండగా, మరికొన్ని రెండు నుంచి నాలుగు అడుగులే మిగులుతున్నాయి. అయితే మరికొంత తగ్గిస్తే చాలా మందికి నష్టం వాటిల్లకుండా ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దుకాణాలకు, ఇళ్లకు నష్టం వాటిల్లకుండా రోడ్డు వెడల్పును తగ్గించి విస్తరించాలని పలువురు కోరుతున్నారు.

కేసముద్రం విలేజిలో మహిళల రాస్తారోకో..

రోడ్డు వెడల్పును 50 ఫీట్లకు తగ్గించాలనే డిమాండ్‌తో కేసముద్రం విలేజి ఎన్టీఆర్ సెంటర్‌లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా మహిళలు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు అడ్డుగా నిలబడి నినాదాలు చేశారు. 80 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరిస్తే తమ ఇళ్లు కోల్పోతున్నామని, 50 ఫీట్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. వరంగల్-మహబూబాబాద్ రహదారి కావడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు రాస్తారోకో ప్రాంతానికి వెళ్లి ఆందోళనచేస్తున్న మహిళలను శాంతింపజేసి విరమింపజేశారు.



కేసముద్రం విలేజిలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

పాన్‌షాప్ పూర్తిగా పోతోంది..



మార్కెట్ గేటు వెంటే ఎనిమిది అడుగులు ఉండే నా పాన్‌షాప్‌కు ఏడు అడుగులు తొలగించాలని మార్కింగ్ వేశారు. రోడ్డు విస్తరణతో నా దుకాణం పూర్తిగా కూల్చి వేస్తుండడంతో ఉపాధి కోల్పోవాల్సివస్తోంది. 66 ఫీట్లకు వెడల్పును తగ్గిస్తే చాలామంది వరకు దుకాణాదారులకు, ఇళ్లకు మేలు జరుగుతుంది.

- ఎండీ.హఫీజ్, పాన్‌షాప్ నిర్వాహకుడు, మార్కెట్‌రోడ్డు



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో ముందస్తు సందడి

మేడారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మినీ జాతరకు ముందుగానే భక్తుల సందడి నేలకొంది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారం తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క సారలమ్మ నామస్మరణలతో డప్పు చప్పుళ్ల నడుమ శివసత్తుల పూనకాలతో అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా బంధుమిత్రులతో కలిసి నిలువెత్తు బంగారం(బెల్లం) చీరెలు, సారెలు, పూలు, పండ్లు, పసుపు కుంకుమ కొబ్బరికాయలు, యాట మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులకు ప్రత్యేక పూజలు చేసి కోరికలు తీరాలని వేడుకున్నారు. సుమారు 10వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

దొంగలున్నారు.. జాగ్రత్త

మేడారం వనదేవతల వద్దకు వచ్చే భక్తులు అమ్మవార్లను దర్శించుకునే సమయంలో భక్తి భావంతో తన్మయత్వం పొందుతున్నారు. ఈ క్రమంలో భక్తుల రూపంలో వచ్చిన దొంగలు చేతివాటం చూపుతున్నారని దేవాదాయ అధికారులు అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులకు సూచనలు చేస్తున్నమని అధికారులు తెలిపారు. మినీ జాతర సందర్భంగా ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చే భక్తులు అమ్మవార్ల గద్దెల వద్ద రద్దీ ప్రాం తాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుకుంటున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగలను పట్టుకోవడానికి పోలీసులు గురువారం నిఘా పెట్టారు.

ఆరు గ్యారెంటీల అమలేదీ?

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత



మహిళలతో మాట్లాడుతున్న కవిత

మరిపెడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలేదని ఐద్వా మానుకోట జిల్లా అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. గురువారం ఐద్వా ఆధ్వర్యంలో మరిపెడలోని నిరుపేదలు నివసించే ఏరియాలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

రూ. 2వేల పింఛన్ 4వేలు, మహిళలకు నెలకు రూ.2500, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ పెంపు, కరెంట్ బిల్లుల మాఫీ, గ్యాస్ సబ్సిడీ మెజార్టీ ప్రజలకు అందడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సర్వేలో ఆ సంఘం మరిపెడ మండల బాధ్యులు కొక్కు శ్రీదేవి, బాణాల రాజమ్మ, ఎల్లమ్మ, వెంకటమ్మ, అరుణ, రజిత, అబ్బాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్

తొర్రూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషిచేయాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ అన్నారు. గురువారం తొర్రూరు పోలీసుస్టేషన్ ఆవరణంలో కలియతిరిగి, రికార్డులను పరిశీ లించారు. అనంతరం డీఎస్పీ స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలకు తావు లేకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్ద డానికి పోలీసులు పాటుపడాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఏమైన పెండింగ్ కేసులు ఉన్నాయా అంటూ ఎస్సై ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉంటే ఏస్థాయిలో ఉన్నాయి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల ప్రభావం అధికంగా ఉన్నందున ప్రజలకు ఎప్పటి కప్పుడు అవగాహన కలిపించాలని సూచించారు. గ్రామాల్లో ఏమైన అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడే వారిని గుర్తించడం కోసం వీపీఏలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. తొర్రూరు సీఐజగదీష్, ఎస్సై జి.ఉపేందర్, రాంజీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు ఇష్టమైన రంగాల్లో రాణించాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు విద్యతో పాటు.. తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలని పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క సూచించారు. గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి బుధవారం రాత్రి మంత్రి సీతక్క నిద్రించారు. గురువారం ఉదయం విద్యార్థులతో కలిసి వ్యాయామం చేశారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని బానోత్ ప్రణవి సీఎం కప్‌లో బాక్సింగ్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, ప్రణవిని సీతక్క అభినందించారు. రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారుడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అన్నిక్రీడలు ఆడుతాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్రహిస్తుందన్నారు.

అందులో భాగంగానే సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు శ్రీలత, మీనా, శాంత, రమణీ, జ్యోతి, శోభన్, సారంగపాణి, ఏఎన్ఎం సరస్వతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్ సింగ్, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, మాజీ సర్పంచ్‌లు ఇర్ప రాజేశ్వర్, మల్లెల రణధీర్, ఈసం స్వామి, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న సీతక్క

సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- బతుకమ్మలతో ఉద్యోగుల వినూత్న నిరసన



సమ్మె శిబిరం వద్ద బతుకమ్మలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులకు నేటి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో చేస్తున్న సమ్మె గురువారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సబ్ డివిజనల్ కార్యదర్శి గుజ్జుదేవేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు వేర్వేరుగా సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నారని, వారితో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సబ్ డివిజనల్ కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ.. గత ఇరవైసంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వీరి వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు డిమాండ్ పిలుపునిచ్చారు. అనంతరం మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి కోలాటాలు వేస్తూ నిరసన తెలిపారు. సమ్మె శిబిరం వద్ద విద్యార్థిని ప్రదర్శిని చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ సమ్మెలో ఉద్యోగులు వీరన్న, ఖాదర్, భాస్కర్, వీరస్వామి, రవి, బాబులాల్, సాగర్, మంజుల, ప్రభావతి, సరస్వతి, విజయలక్ష్మీ, ఉమ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జాతీయ అవార్డు

జనగామ కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు జాతీయ అవార్డు అందుకున్నారు. పట్టణం లోని ధర్మశాల హరిజన కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎర్రబెల్లి మాణిక్యం ఉపాధ్యాయురాలు పనిచేస్తున్నారు.

ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో 2024 సంవత్సరానికి జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ సోషల్ సర్వీసెస్ అండ్ లీడర్ షిప్ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా బుధ వారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, రామకృష్ణ గౌడ్, దైవజ్ఞశర్మ, వల్లూరి శ్రీనివాసరాజు చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు ఎర్రబెల్లి మాణిక్యం



విజయలక్ష్మికి ఆలయ విశిష్టతను తెలియజేస్తున్న గైడ్

బిహార్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ

రామప్ప సందర్శన

వెంకటాపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయాన్ని గురువారం బిహార్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్‌లు ఆమెను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె ఆలయ శిల్పకళా సంపదను పరీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

న్యాస్ ఫీల్డ్ ఇన్విజిలేటర్ల డబ్బులు ఏవీ ?

భూపాలపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ ఆచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షకు సంబంధించిన డబ్బులు పడకపోవడం పట్ల సంబంధిత ఇన్విజిలేటర్లు ఆందోళన చెందుతున్నారు. ఆ డబ్బులు చెల్లించడంలో జాప్యం జరగడం పట్ల తీవ్ర అసంతృప్తికి గుర వుతున్నారు. వివరాల్లోకి వెళితే.. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నేషనల్ ఆచీవ్‌మెంట్ సర్వేపై డిసెంబర్ 4న పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు ముందు జిల్లాలోని 130 మంది ఇన్విజిలేటర్లకు నవంబరు 27న శిక్షణ కూడా ఇచ్చారు. అనంతరం పరీక్ష నిర్వహించారు. ఇందులో ఇన్విజిలేషన్ చేసిన వారికి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉంది.

కానీ ఇప్పటివరకు ఆ డబ్బులు రాకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ముందే నిధులు వచ్చాయని తెలిసినప్పటికీ తమకు చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై డీఈవో రాజేందర్‌ను వివరణ కోరగా నిధులు వచ్చాయని, ఇన్విజిలేషన్ చేసిన వారి అకౌంట్లలోకి నేరుగా డబ్బులు పంపించడం జరుగుతుందని, ఆ ప్రాసెస్ ప్రారంభమైనట్లు తెలిపారు. అందరికీ డబ్బులు తప్పనిసరిగా వస్తాయని, దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

కనుల పండువగా కోటంచ లక్ష్మీనరసింహుడి కల్యాణం

రేగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంచ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం సుదర్శన నరసింహస్వామి హోమం నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. లక్ష్మీనరసింహస్వామి లక్ష్మీ అమ్మవార్లను పట్టువస్త్రాలతో అనుకరించి వేద పండితుల మంత్రోచ్చరణాలతో కల్యాణం జరిపారు.

ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. అనంతరం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మహేష్, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తలంబ్రాలు పోస్తున్న పూజారులు



ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మహేందర్, ఉమర్

జనగామ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జనగామ జిల్లా వాసులు ఎన్నికయ్యారు. గురువారం సిద్దిపేట జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో జనగామ జిల్లాకు చెందిన మహేందర్, ఎండి.ఉమర్‌ను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకుంటున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, కార్యదర్శి మాచర్ల రాంబాబు ప్రకటించారు. మహేందర్ జనగామలో బీకాం, ఉమర్ బీజెడ్సీ చదువుతున్నారు.



మహేందర్



ఉమర్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయికి ధన్యవాదాలు తెలుపుతూ ఏబీవీపీ ద్వారా విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లో క్రీడా పోటీల ఏర్పాట్లను డీవైఎస్‌వో పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, సేపక్ తక్రా, హ్యాండ్‌బాల్ పోటీలను జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వ హిస్తామన్నారు. అదేవిధంగా ఎర్రగట్టు గుట్ట వద్దగల కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 29 వరకు క్రీడా పోటీలు కొనసాగుతున్నాయన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని విధా లా వసతులను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, రమేష్, శంకర్, వెంకటేశ్వర్లు, అఫ్జల్, విష్ణు, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి గుంతలో పడిన కారు

వాహనదారులకు తప్పిన ప్రమాదం

మేడారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి కారు గుంతలోకి దూసుకెళ్లిన సంఘటన తాడ్వాయి మండలం లింగాల గ్రామ అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు చెందిన వనదేవతల భక్తులు అమ్మవార్ల దర్శనం కోసం మేడారం వస్తున్న క్రమంలో లింగాల గ్రామం శివారు అటవీ ప్రాంతంలో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లిందని తెలిపారు. ఈ ఘటనలో వాహనదారులకు ప్రమాదం తప్పిందని అన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు అధికంగా జరిగాయని స్థానిక గ్రామస్తులు తెలుపుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల వద్ద హెచ్చరికలు లేకపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు.



గుంతలో పడిన కారు

కళాకారుడు జగన్నాథం మృతి తీరనిలోటు

- ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలి
- తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ



జగన్నాథం (ఫైల్)

నర్మెట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ, సాంస్కృతిక కళారూపానికి పూర్వవైభవం తీసుకువచ్చిన మోతె జగన్నాథం మృతి తీరని లోటని, ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలని తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జనగామ జిల్లా నర్మెట మండలం అమ్మాపురంనకు చెందిన చెక్క తీగల తోలుబొమ్మలాట కళాకారుడు మోతె జగన్నాథం(70) ఇటీవల అనారోగ్యంతో ఆకస్మిక మృతి చెందగా, కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బొమ్మలోల్లు అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం.. శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించేందుకు అంకితభావంతో పాటుపడ్డారని కొనియాడారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ఆయనప్రాణం పోశాయన్నారు. వీరి బృంద కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. తాను జగన్నాథం బృందంతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో పర్యటించి వర్క్ షాపులు, కళా ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా హైద్రాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనలు ఇప్పించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కళాకారుడు జగన్నాథం బృందంచే దేశంలోని 12కి పైగా రాష్ట్రాల్లో కళా ప్రదర్శనలు ఇస్తూ జాతీయ వేదికలపై గుర్తింపు పొందారన్నారు. ప్రభుత్వం స్పందించి జగన్నాథం కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు

- బీటెక్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు





శివకుమార్ (ఫైల్), ధ్వంసమైన కారు

నర్సంపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఓ బీటెక్ విద్యార్థి అక్కడి కక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలైన సం ఘటన నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని ప్రధాన రహదా రిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకా రం.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రామప్ప కాలనీకి చెందిన తాటి కుమార్ కుమారుడు తాటి శివరాజ్‌కుమార్(20) అలియాస్ జెట్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్‌కు చెందిన శేషగిరి, కరీంనగర్‌కు చెందిన అభిరామ్‌లు లక్నేపల్లిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఇదే గ్రామంలోని బిట్స్ కళాశాలలో బీటెక్(సీఎస్ఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గురువారం రాత్రి శివకుమార్, శేషగిరి, అభిరామ్‌లు బైక్‌పై గ్రామ శివారుకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు వస్తున్న క్రమంలో గ్రామంలోని బస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే వరంగల్ వైపు నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టి, రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, శేషగిరి, అభిరామ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలం సమీ పంలో ఉన్న బేతం అఖిల్, రాకేష్ అనే యువకులు స్పందించి గాయాలపాలైన విద్యార్థులను ప్రైవేట్ వాహనాల్లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం తరలించారు. శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించిన పోలీసులు.. ఘటన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

క్వారీ గుంతలో పడిన విద్యార్థి

గాలిస్తున్న పోలీసులు, రెస్క్యూ టీం



హరీష్ (ఫైల్)

తొర్రూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తవ్వకాలు జరిపి వదిలేసిన క్వారీ గుంతలో విద్యార్థి పడిన ఘటన అమ్మాపురంలో గురువారం చోటు చేసు కుంది. గ్రామస్థుల కథనం ప్రకారం. అమ్మాపురానికి చెందిన కడెం రాజాలు-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు హరీష్ (17) తొర్రూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదవుతూ హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కళాశాలలో స్కాలర్‌షిప్ కోసం బుధవారం గ్రామానికి చేరుకున్నాడు. కాలేజీలో పని చేసుకొని మధ్యాహ్నం వరకు అమ్మాపురానికి వచ్చాడు. సుమారు 3 గంటల సమయంలో తల్లి సునీత తమ బట్టలు మిషన్ వద్ద వేసి రమ్మని చెప్పడంతో అక్కడివెళ్లాడు. ఈ క్రమంలో మిషన్ వద్ద కరెంట్ లేకపోవడంతో అరగంట తరువాత రమ్మని చెప్పడంతో సమీపంలో ఉన్నా క్వారీ వద్దకు బహిర్భూకి వెళ్లి ఉండవచ్చని హరీష్ సోదరుడు గన్‌శ్యామ్ చెబుతున్నాడు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ఆచూకీ లభించకపోవడంతో పోలీ సులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు క్వారీ గుంతలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రిస్క్యూ టీం, ఫైర్ బృందం వచ్చి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు.

అనారోగ్యంతో ఐటీడీఏ ఏపీవో మృతి



భీంరావు (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీవో) కనక భీంరావు(62) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎనిమిది నెలల క్రితం బదిలీపై వచ్చిన ఆయన ఏటూరునాగారం ఏపీవోగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆరోగ్య సమస్యలు వేధించగా కొన్నిరోజులుగా విధులకు సక్రమంగా హాజరుకాలేని పరిస్థితి నెలకొంది.

ఈనేపథ్యంలో బుధవారం ఆరోగ్యం మరింత క్షీణించగా ఆయన స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లా బాంబర మండలం వాంకిడ నుంచి ఆదిలాబాద్‌లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఐటీడీఏ ఉద్యోగులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తొర్రూరు బస్టాండ్ సమీపంలోని ఓ వీధిలో పేకాట ఆడుతున్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన ఆరుగురు పేకాడుతున్నారన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆరుగురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,500 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సవాళ్లు.. వివాదాలు!

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మిశ్రమ రాజకీయ పరిస్థితులు

చర్చనీయాంశమైన కీలక నేతల తీరు


(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు రాజకీయాల్లో 2024 ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చింది. కొందరికి కాలం కలిసొస్తే.. మరికొందరికి అదే కాలం పరీక్ష పెట్టింది. కీలక నేతలు పార్టీ కండువాలు మార్చి గోడలు దూకేశారు. కారు దిగి కాషాయ గూటికి చేరిన గులాబీ నేతలు ఆరూరి, సీతారాంనాయక్‌లకు ఓటమి ఎదురవ్వగా, కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన డాక్టర్ కావ్య ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఓరుగల్లులో కాంగ్రెస్‌లో అసమ్మతి రంకెలు వేసి.. మంత్రి కొండా సురేఖను టెన్షన్‌కు గురి చేయగా, తాను చేసిన వివాదాస్పద వాఖ్యలతో కొండా రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు మాజీ మంత్రి ఎర్రబెల్లిని ఆందోళ నకు గురి చేయగా.. మరోనేత గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. మళ్లీ అదే పార్టీలో చేరాల్సిన పరిస్థితి ఎదురైంది. రాజకీయంగా ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చిన 2024 వ సంవత్సరం ఐదు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుంది. వీటితో పాటు అధికార, ప్రతిపక్షాల నేతల మధ్య మాటల సవాళ్లు తారస్థాయికి చేరాయి. ఢీ అంటే ఢీ అన్నట్టుగా పోటాపోటీ కార్యక్రమాలు, ప్రెస్‌మీట్‌లతో నేతలు మాటల మంటలు రేపారు. పలు సందర్భాల్లో నేతల వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి.

గులాబీ పార్టీకి సవాల్‌గా 2024

పదేళ్ల అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ 2024లో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. 2023 డిసెంబరులో అధికారం కోల్పోయిన తరువాత చాలామంది నేతలు తెరమరుగయ్యారు. అయితే 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలు గులాబీ పార్టీకి అసలైన పరీక్షను పెట్టాయి. బీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మార్చి 13న ప్రకటించారు. అయితే అనూహ్యంగా కడియం శ్రీహరి తన కుమార్తె సహా మార్చి 28న బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ గూటికి తండ్రి కూతుళ్లు చేరారు. దీంతో బీఆర్ఎస్ భారీ షాక్‌కు గురైంది. గులాబీ కండువా పక్కన పడేసి కాంగ్రెస్ జెండాతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కడియం కావ్య విజయం సాధించారు. అయితే ఎంపీ అభ్యర్థి పార్టీ మారటంతో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన గులాబీ పార్టీ అభ్యర్థి కోసం వెతుక్కోవాల్సి వచ్చింది. మరోవైపు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్. కడియం కావ్యకు టికెట్ ఇస్తారని భావించి మార్చి 17వ తేదీన బీజేపీలో చేరారు. వరంగల్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అలాగే మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి మార్చి 10న ఢిల్లీలో బీజేపీలో చేరి, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. నలుగురు కీలక నేతలు బీఆర్ఎస్‌ను వీడటంతో పాటు బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయటంతో గులాబీ పార్టీకి 2024 సంవత్సరం భారీ ఝులక్ ఇచ్చినట్లైందనే చర్చ జరిగింది. వీరితో పాటు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లాంటి కీలక నేతలు గులాబీ పార్టీని వీడారు. వీరితో అనేక మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా కారు పార్టీకి బైబై చెప్పారు. 2024లో అత్యంత గడ్డు పరిస్థితులను బీఆర్ఎస్ ఎదుర్కొన్నది.

కొండాకు అసమ్మతి సెగ.. ఎర్రబెల్లికి ట్యాపింగ్ టెన్షన్



ఉమ్మడి వరంగల్ జిల్లా మ్యాప్

ఓరుగల్లు రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న మంత్రి కొం డా సురేఖ దంపతులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రా వులకు 2024 ఓ రకంగా హై టెన్షన్‌లోనే పెట్టింది. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కొండా సురేఖకు చోటు దక్కినా ఓరు గల్లు రాజకీయాల్లో పట్టు చిక్కడం లేదని, ఈ క్రమంలోనే మంత్రి సురేఖతో పలువురు ఎమ్మెల్యేలతో పొసగడం లేదనే చర్చ జరుగుతోంది. తమ నియోజకవర్గాల్లో మంత్రి జో క్యం చేసుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీలకు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేయటం రా ష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అక్టోబరు 13న మంత్రి కొండా సురేఖ గీసుకొండలో ధర్నా చేయటమే కాకుండా, సీఐ కుర్చీలో కూర్చోవటం రాజకీయంగా పెద్ద దుమారాన్నే లేపింది. అలాగే పరకాల ఎమ్మె ల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో జరిగిన ఫోన్ సంభాషణ బయ టకు లీక్ కావటం మరింత వివాదంగా మారింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ చేసిన వాఖ్యలు కూడా పార్టీలో అసంతృప్తిని రగిలించాయి. అజం జాహి కార్మిక భవన్‌ను కూల్చివేసి, ఓ వస్త్ర వ్యాపారి షాపిం గ్‌మాల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొనడం రాజకీయంగా సంచలనంగా మారింది. ఆ తర్వాతి పరిణామాలతో కొండా మురళి యూటర్న్ తీసుకోవాల్సి వచ్చింది. అలాగే సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. ఈ ఏడాదంతా కొండా దంపతులు ఏదో ఒక వివాదం లోనే ఉన్నారన్న చర్చ ప్రజల్లో ఉంది. అలాగే కొండాకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఈ ఏడాది ఫోన్ ట్యాపింగ్ కేసుతో హైటెన్షన్ పడాల్సి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్‌లో తన ప్రమేయం ఇసుమంత కూడా లేదని ఖరాకండిగా చెప్పినా.. మీడియాలో మాత్రం ఎర్రబెల్లిపై కథనాలు రావటం ఓరుగల్లు రాజకీయాల్లో హాట్‌టాపిక్ అయ్యింది. పర్వతగిరి కేంద్రంగా మాజీ డీఎస్పీ ప్రవీణ్‌రావు పలువురి ఫోన్లు ట్యాప్ చేశారన్న ప్రచారం నేపథ్యంలో అం దరి చూపు ఎర్రబెల్లిపై పడింది. మొత్తానికి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతో పాటు కీలక నేతలకు 2024 ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చింది.

కాంగ్రెస్ సక్సెస్ యాత్ర.. తలకిందులైన కాషాయం అంచనాలు

ఈ ఏడాది సక్సెస్ రేట్‌లో ఉన్నది కాంగ్రెస్ పార్టీనే. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసింది. వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ బలపడుతున్న వైనాన్ని పసిగట్టి, బీఆర్ఎస్‌లో బలమైన నేతగా ఉన్న కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తీసుకురావటం కాంగ్రెస్‌కు కలిసి వచ్చిందనే టాక్ ఉంది. కడియం శ్రీహరి కూమార్తె కడియం కావ్యను ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా బరిలో దించటంతో విజయం సొంతమైందనే టాక్ ఉంది. ఇక మహబూబాబాద్‌లో తొలి నుంచి కూడా కాంగ్రెస్ అనుకూల గాలులే వీయడం.. గెలుపు ఈజీ అయిందన్నది అందరి అభిప్రాయం. అయితే ఓరుగల్లులో కాషాయ జెండా ఎగురవేయాలనే తాపత్రయంతో ఉన్న బీజేపీ అంచనాలు 2024లో తలకిందులయ్యాయి. వరంగల్ లోక్‌సభ పరిధిలో ఎక్కువ పట్టణ ఓటర్లు ఉండటంతో పాటు మోదీ ఇమేజ్ కూడా భారీగానే కనిపించింది. కానీ పోల్‌మెనేజ్మెంట్‌లో వెనుకడుగు వేయటం ఆ పార్టీ 40ఏళ్ల ఆశలపై నీళ్లు చల్లిందనే చర్చ ఉంది.

బీఆర్ఎస్ నుంచి కీలక నేతలు కాషాయ పార్టీలో చేరినా.. విజయం మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. అయితే ఏ మాత్రం పట్టులేని పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు పోలవ్వటం, మంత్రి సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్‌తూర్పులో మెజార్టీ సాధించడం 2024లో బీజేపీకి ఊరటను కలిగించే అంశాలుగా చెబుతున్నారు.

కడియంకు లక్.. తాటికొండకు ఝలక్..

2024లో స్టేషన్‌ఘనపూర్ రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరి, తన కూతురు కడియం కావ్యను ఎంపీగా గెలిపించుకున్నారు. తన రాజకీయ వారసురాలిని తెరపైకి తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు. తొలి ప్రయత్నంలోనే కడియం కావ్య ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. కడియం కండువా మార్చినా రాజకీయంగా సక్సెస్ సాధించినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొం టున్నారు. అయితే ఇదే స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గానికి చెందిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యకు 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదు. కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా నిలబెట్టగా.. కడియం ఎమ్మెల్యేగా గెలవటం.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాజయ్య చూపు తన పాత పార్టీపై పడింది. ఫిబ్రవరి 3వ తేదీన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య... కాంగ్రెస్‌లో చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసి ఓడిపోయినా శనగపురం ఇందిరా రాజయ్య చేరికను అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. ఈలోపు బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి రావటంతో రాజయ్యకు ఢిల్లీ స్థాయిలో కూడా తలుపులు మూసుకుపోయాయి. దీంతో ఏప్రిల్ 14న గులాబీ అధినేత కేసీఆర్‌ను కలిసి మళ్లీ గులాబీ గూటికి చేరారు. కోపంతో కారు దిగి.. గత్యంతరం లేక యూ టర్న్ తీసుకుని అదే కారులోకి రాజయ్య రావటం 2024లో జరిగిన విచిత్ర రాజకీయంగా చెబుతున్నారు.

కేయూ విద్యార్థులందరికీ హాస్టల్ వసతి

- గతంలో లాగా రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేవు
- అదనంగా రెండు హాస్టళ్లు, మెస్‌ల ఏర్పాటు
- ఈ సంక్రాంతికి అందుబాటులోకి..

కేయూ క్యాంపస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఈ ఏడాది రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులు చదువుతున్న విద్యార్థులందరికీ హాస్టల్స్ వసతి కల్పిస్తూ వర్సిటీ అధికారులు చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ గతంలో ఇలాంటి సౌకర్యాలు కల్పించలేదు. తాజాగా ఈ ఏడాది రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేకుండా వర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ హాస్టల్, మెస్ ఇవ్వడంతో విద్యార్థులు బాగా చదువుకునే అవకాశం లభిస్తుంది. వర్సిటీలోని ఎంత మందికైనా మెస్, హాస్టల్ ఇచ్చే విధంగా హాస్టల్ అధికారులు సిద్ధం అయ్యారు. దీంతో కేయూ పరిధిలోని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు మరింతగా వర్సిటీలోని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

500 బెడ్లలో అమ్మాయిలకు నూతన హాస్టల్

కేయూ పోతన హాస్టల్ ఎదురుగా సుమారు 500 బెడ్ల సామర్థ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ ఏడాది నూతనంగా హాస్టల్ నిర్మించనున్నారు. దీంతో వర్సిటీలో చదివే అమ్మాయిలకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు అవకాశం లభిస్తుంది. ఇప్పటికే 200 బెడ్ల సామర్థ్యంతో వర్సిటీ క్యాంపస్‌లో నిర్మించిన సమ్మక్క-సారక్క హాస్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో అమ్మాయిలకు హాస్టల్ కొరత తీరనుంది.

వెయ్యి మంది భోజనాలు చేసేందుకు వీలుగా..

కేయూలో ఇప్పుడున్న కామన్ మెస్‌కు దీటుగా మరో రెండు అదనపు మెస్‌లు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే వర్సిటీ న్యూబాయ్స్ డిజిటల్ హాస్టల్‌లో అదనపు మెస్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సంక్రాంతి పండుగ వరకు విద్యార్థులకు మెస్ అందుబాటులోకి రానుంది. దీంతో న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు కామన్ మెస్ వరకు వచ్చి భోజనం చేసేందుకు పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి.

లేడీస్ హాస్టల్‌నూ అదనపు మెస్ ఏర్పాటు



వర్సిటీ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో ఒకే దఫా సుమారు 500 నుంచి 1000 మంది కూర్చొని భోజనం చేసేందుకు వీలుగా నూతన మెస్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పనులకు సంబంధించిన అన్ని అనుమతులు లభించాయి. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వర్సిటీ హాస్టల్స్ అధికారులు, డెవలప్‌మెట్ అధికారులు సన్నద్ధం అయ్యారు.

అందుబాటులోకి జీడీ-1, స్పోర్ట్స్ హాస్టల్స్

కొన్నేళ్లుగా మూలకుపడిన జీడీ-1, స్పోర్ట్స్ హాస్టల్స్‌ను ఈ దఫా విద్యార్థులకు హాస్టల్స్ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. స్వల్ప మరమ్మతుల కారణంగా జీడీ-1 హాస్టల్‌ను వర్సిటీ అధికారులు మూసివేశారు. దీనిలో సుమారు 150 మందికి వసతి కల్పించే వీలున్నా అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. తాజాగా జీడీ-1కు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే అన్ని సదుపాయాలున్న స్పోర్ట్స్ హాస్టల్‌ను మూడేళ్లుగా ఎవ్వరికీ కేటాయించకుండా నిర్లక్ష్యం వదిలివేశారు. దీనిలో ఈ ఏడాది మరో 140 మందికి వసతి కల్పించారు. మూలకు పడ్డ హాస్టల్స్‌ను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు వసతి కల్పించడంపై వర్సిటీలోని విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీ హాస్టళ్లు

తెలంగాణలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరు గాంచిన కేయూలో గ్రామీణ పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంతకుముందు వర్సిటీలోని పద్మాక్షి లేడీస్ హాస్టల్స్, సమ్మక్క-సారక్క హాస్టల్, పోతన హాస్టల్‌ను మహిళలకు కేటా యించగా, న్యూ బాయ్స్ పీజీ హాస్టల్, జీడీ-1, జీడీ-2, జీడీ-3తో పాటు అంబేద్కర్, విద్యారణ్య, స్పోర్ట్స్ తదితర హాస్టల్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీ క్యాంపస్‌లో అబ్బాయిలు, అమ్మాయిలంద రికీ కలిసి ఈ ఏడాది 4, 200 మందికి హాస్టల్, మెస్ సౌకర్యం కల్పించారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీ కళాశాలకు వసతి, మెస్‌ను అందుబాటులోకి తెచ్చారు.

బోధన ఫీజులకు ఎదురుచూపులు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకార వేతనాల అందక కష్టాలు పెరుగుతున్నాయి. ఐదేళ్లుగా ఫీజుల బకాయిలు అందకపోవడంతో ఆందోళలు వ్యక్తం అవుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం నాటికి బోధనా ఫీజులు, ఉపకార వేతన బకాయిలు రాష్ట్రంలో దాదాపు రూ.5,165కోట్లకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో కేయూ విద్యార్థుల బకాయిలతో వర్సిటీ హాస్టల్స్‌పై భారం పడుతున్నాయి. రెండేళ్లుగా మెయింటెనెన్స్ చార్జీలను (ఎంటీఎఫ్)లను విడుదల చేయడం లేదు. దీంతో వర్సిటీలో విద్యార్థులకు భోజనం, హాస్టల్స్ నిర్వహణకు వర్సిటీ అధికారులు నిధుల కోసం వెంపర్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజులు మంజూరైనట్లు ప్రోసీడింగ్ వస్తే చాలు.. భోజనంతో పాటు హాస్టల్స్ వసతి కల్పించాలనే నిబంధనలున్నాయి. అలాగే ఆయా విద్యార్థుల చదువుల సర్టిఫికెట్లను సైతం వెంటనే ఫీజుల బకాయి విడుదలతో సంబంధం లేకుండా జారీ చేయాలని చెబుతున్నాయి.

విద్యార్థులకు అండగా..

కేయూలో విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం విడుదల చేయనప్పటికీ వర్సిటీ అధికారులు విద్యార్థులకు అండగా నిలిచి రెగ్యులర్‌తో పాటు ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్స్, మెస్ సౌకర్యం కల్పించడం గమనార్హం. రెగ్యులర్ విద్యార్థులతో పోల్చితే కొన్ని ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ ఫీజులు, మెస్ బకాయిలన్నీ చెల్లించదు. విద్యార్థులే స్వయంగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి. విద్యార్థులు కొందరు చదువు పూర్తయిన వెంటనే ఫీజులకు డబ్బుల్లేక వర్సిటీకి చెల్లించలేని పరిస్థితి ఉంటుంది.

ఆయా విద్యార్థుల మెస్ ఖర్చుల భారం వర్సిటీ భరించాల్సి ఉంటుంది. దీంతో గతంలో వర్సిటీలో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యా ర్థులకు హాస్టల్స్, మెస్ ఇచ్చేందుకు వర్సిటీ అధికా రులు వెనుకడుగు వేశారు. ఇప్పుడు విద్యార్థులందరికీ హాస్టల్స్, మెస్ ఇవ్వడంతో విద్యార్థులు సంతోషంగా వర్సిటీ క్యాంపస్‌లో చదువుకునేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. అనేక మంది విద్యార్థులకు హాస్టల్స్ అధికారులు అండగా నిలుస్తున్నారు.

వర్సిటీ కామన్ మెస్‌లో ఇక్కట్లు

వర్సిటీలోని వెయ్యి మంది విద్యార్థులు ఒకే దఫా కూర్చొని అల్పాహారంతో పాటు భోజనం చేసేందుకు వీలుగా వర్సిటీలో కామన్ మెస్‌ను ఏర్పాటు చేశారు. వర్సిటీని బా య్స్ హాస్టల్స్ విద్యార్థులందరికీ కామన్ మెస్‌లోనే భోజనాల ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థులందరికీ సరిపడా వంట కాలు చేసే క్రమంలో అనేక దఫాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కామన్ మెస్‌లో విద్యార్థుల తాకిడి ఎక్కువగా పెరగడంతో ఒక్కోరోజు వంటకాలు అందడం లేదు. అలాగే మరో రోజు భోజనాల సన్నాహ అంచనాలు తప్పి భోజనాలు సరిపోవడం లేదు. భోజనాలు సరిపోని విద్యార్థులు తమకు భోజనం కావాలంటూ నిరసన ఆందోళనలకు దిగుతున్నారు. దీంతో వర్సిటీలోని హాస్టల్ విద్యార్థులను విభజించనున్నారు. నూతనంగా న్యూ పీజీ డిజిటల్ హాస్ట ల్స్‌లో మెస్ ఏర్పాటు చేస్తే కామన్ మెస్‌పై భారం తగ్గుతుందని భావించారు. విద్యార్థులను ఇప్పటి కంటే మరింత నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.



రాహుల్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పరశురామ్

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- నా పోరాటానికి మద్దతివ్వండి
- 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ రాహుల్‌కుమార్‌కు పరశురామ్ వినతి

జనగామ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించాలని, తన ఈ పోరాటానికి మద్దతునివ్వాలంటూ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ ఎన్. రాహుల్‌కుమార్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో రాహుల్‌కుమార్‌ను పరశురామ్ కలిశారు. తొలుత ఇటీవల ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరశురామ్ మాట్లాడుతూ తన వినతి విషయంపై రాహుల్‌కుమార్ స్పందించారని, తాను చేస్తున్న ఉద్యమం న్యాయబద్ధమైందని, దానికి తన సహకారం ఉంటుందని స్పష్టం చేశారన్నారు.

పుష్కరిణి.. పాహిమాం!

- వచ్చే ఏడాది మేలో సరస్వతీ పుష్కరాలు
- ఏర్పాట్లు, పెండింగ్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్
- ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- వరుస సమావేశాలతో ముందుకు కదులుతున్న ఫైళ్లు



కాళేశ్వరాలయం

మహదేవపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పుష్కరిణిలో స్నానాలు చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని నమ్ముతుంటారు. ఈ క్రమంలోనేనే పన్నెండేళ్లకోసారి వచ్చే ఈ ఉత్సవాల కోసం భక్తులు ఎదురుచూస్తూ అంటారు. మన రాష్ట్రంలో ఎక్కువగా గోదావరి, కృష్ణా పుష్కరాలకు ప్రాచుర్యం ఉంటుంది. ఇక దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద జరిగే సరస్వతీ పుష్కరాలకు సమయం దగ్గరపడుతోంది. వచ్చే ఏడాది మే నెలలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సమూహం వద్ద సరస్వతీ పుష్కరాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. త్రిలింగాలలో ఒకటైన కాళేశ్వరం దేవాలయం అతి ప్రాచీనమైంది. నది ఒడ్డున ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉన్న పుణ్యక్షేత్రంగా కాళేశ్వరం పేరొందింది. ఇంత పవిత్ర దేవాలయం వద్ద జరిగే పుష్కరాలు అంటే భక్తులు భారీగా తరలొస్తుంటారు. కార్తీక మాసంలోనే రోజూ 30వేల నుంచి 40వేల మంది భక్తులు తరలివచ్చారు. ఇక సరస్వతీ పుష్కరాలకు.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి రోజుకు సుమారు 50వేలకు పైగా భక్తులు తరలొస్తారని అంచనా.

రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక

పుష్కరాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రణాళిక సిద్ధం చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ సెక్రటరీ, దేవాదాయ శాఖ కమిషనర్లు ఇటీవల కాళేశ్వరం, భూపాలపల్లిలో వరుస సమావేశాలు నిర్వహించారు. పెండింగ్ పనులపై ఆరా తీశారు. రెండు సార్లు దేవాదాయ శాఖ మంత్రి, ఇతర అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశాలు నిర్వహించి.. పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఫిబ్రవరిలో కుంభాభిషేకం

కాళేశ్వరంలో ఫిబ్రవరి చివరివారంలో కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నట్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు హైదరాబాద్ సమీక్ష సమావేశంలో వివరించారు. 1982లో ఆలయ పునప్రతిష్ఠ అయినప్పుడు ఆ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మళ్లీ ఫిబ్రవరిలో నిర్వ హించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులు

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలో ఉన్న గోదావరి వద్ద శాశ్వత నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరుగుదొడ్లు, డస్ట్ బిన్‌లు, ప్రత్యేక ఘాట్‌లు, స్త్రీలు దుస్తు మార్చుకునే గదులు, భక్తులు సేద తీరేందుకు షెడ్లు నిర్మించనున్నారు. అలాగే వంద గదుల వసతి గృహానికి సంబంధించిన పనులు పూర్తి చేయాలని మంత్రి ఇదివరకే అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆలయ గోపురానికి వేసిన రంగు, ఇతర ఆలయాలకు వేసే రంగు ఒకటిలా ఉన్నాయని, దాంతో శివుడికి ప్రీతికరమైన బూడిద రంగు వేయాలని పలువురు భక్తులు సూచించడంతో అదికూడా పెండింగ్‌లో ఉంది. ఆలయానికి రెగ్యూలర్ ఈవో లేరు. ఇన్‌చార్జ్ ఈవోగా మారుతి కొనసాగుతున్నారు. అతిపెద్ద ప్రాచీన దేవాలయమైన కాళేశ్వరానికి అసిస్టెంట్ కమిషనర్ హోదాకు తగ్గట్టుగా అధికారిని నియమించాల్సి ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు సరిపడా అర్చకులు లేరు. ఇటీవల కొంతమంది పదవీ విరమణ పొందారు. దాదాపు 10 మంది అర్చకులను నియమించాల్సి ఉంది. అన్న సత్రం నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది.



గోదావరి వద్ద భక్తుల రద్దీ (ఫైల్)



ఉచిత బస్సు ప్రయాణంతో మరింత పెరుగనున్న మహిళల రాక

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్నందున కాళేశ్వరానికి ఈ సారి మహిళా భక్తులే పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మే నెలలో వచ్చే పుష్కరాలు కాబట్టి వ్యవసాయ పనులు అన్ని పూర్తయి ఉంటాయి. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు తరలిరానున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాళేశ్వరానికి భస్సులు నడవనున్నదున మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

నిరుపయోగంగా మార్కెట్ స్టాల్స్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తొర్రూరులోని సమీకృత మార్కెట్ సముదాయం
- రూ.4 కోట్లతో రెండు అంతస్తులు నిర్మాణం
- రోడ్లపైనే క్రయవిక్రయాలు.. పట్టించుకోని అధికారులు



మార్కెట్‌లో రెండో బ్లాక్‌లో తాగి పడేసిన మద్యం సీసాలు



తొర్రూరు మోడల్ మార్కెట్‌లో వృథాగా స్టాల్స్

తొర్రూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మోడల్ మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తొర్రూరు పట్టణంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కోసం కూరగాయలు, మాంసాహారం, చేపలు ఒకేచోట లభించే విధంగా సమీకృత మార్కెట్ ఏర్పాటు చేసింది. సుమారు రూ.4 కోట్లతో కట్టగా.. మార్కెట్‌ను 2023 మార్చి 8న అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఆరుబయటే విక్రయాలు జరుగుతున్నాయి. మొదటి బ్లాక్‌లో కూరగాయల కోసం 48 స్టాల్స్ ఏర్పాటు చేయగా, వాటిలో 24 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 2వ అంతస్తులో 48 స్టాల్స్ వృథాగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

20 గుంటల ప్రభుత్వ స్థలంలో..

తొర్రూరు పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉండాలనే ఆలోచనతో గత ప్రభుత్వం 20 గుంటల ప్రభుత్వ స్థలంలో టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.4 కోట్లతో మార్కెట్ భవనం నిర్మించారు. కానీ, ఆశించిన మేర ఉపయోగంలేకుండా పోతోంది. మొదటి అంతస్తులో కూరగాయలు, రెండో అంతస్తులో మాంసం విక్రయాలు, 3వ అంతస్తులో షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు చేపట్టారు. కానీ, రెండు బ్లాక్‌ల నిర్మాణమే పూర్తయింది. రెండో బ్లాక్ ఖాళీగా ఉండడంతో మందుబాబులు రాత్రి వేళల్లో బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో ఒంటరిగా ఉండే వారికి ఇది నిలయంగా మారింది. పేకాట ఆడటం వంటివి జరుగుతుండడంతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భవనంలో విద్యుత్ సామగ్రి, ఫ్యాన్‌లు ఉండడంతో అల్లరిమూకలు వాటిని ధ్వంసం చేస్తున్నారు. రెండో బ్లాక్‌లో ఉన్న 48 స్టాల్‌లలో మాంసం విక్రయాలు చేపట్టాలి. కానీ, ఎవరూ ముందుకు రాకపోవడంతో వృథాగా ఉన్నాయి. ప్రతీ ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపైనే మాంసం విక్రయాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే మార్కెట్‌ను సందర్శించి, క్రయవిక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

రోడ్లపైనే అమ్మకాలు

తొర్రూరు పట్టణంలో మార్కెట్‌లో స్టాల్స్ ఉన్నా విక్రయదారులు రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు చేపడుతున్నారు. అయితే మార్కెట్‌లో విక్రయాలు జరగవని భావించిన వ్యాపారులు రహదారిపైనే అమ్మకాలు చేపడుతుండటంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మార్కెట్‌లో నిర్మించిన మూత్రశాలలకు మునిసిపాలిటీ నీటి సరఫరా చేయకపోవడంతో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు మునిసిపల్ అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదని, ప్రతీ మంగళవారం తాము మార్కెట్ రశీదు, నెలవారి కిరాయిలు కూడా చెల్లిస్తున్నామని, కనీసం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శ్రీవీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.39 లక్షలు

కురవి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కురవి భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి దేవాలయం ఆదాయం హుండీ ద్వారా 39 లక్షల 4 వేల 29 రూపాయలు లభించినట్లు కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. కురవిలో గురువారం ఆలయంలో నిర్వహించిన లెక్కింపులో వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.28 లక్షల 32 వేల 577, భద్రకాళి అమ్మవారి హుండీలో రూ.10 లక్షల 71 వేల 452 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ఈ లెక్కింపునకు కె.వేణుగోపాల్ పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, వెంపటి శ్రీను, సక్రునాయక్, కుదురుపాక ఉప్పలయ్య, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, బిక్షపతి, సోమ్లనాయక్ పాల్గొన్నారు. ఈ లెక్కింపులో మహాలక్ష్మి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ బస్టాండ్ ప్లాట్‌ఫాం ఎక్కనున్న బస్సులు

- మూహూర్తం ఫిక్స్.. ఏర్పాట్లను పరిశీలించిన డీఎం
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



మరిపెడ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మానుకోట ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్

మరిపెడ, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలల తర్వాత మరిపెడ ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫాంను ఎక్కనున్నాయి ఆర్టీసీ బస్సులు. ఈనెల 23న ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లెయిడ్‌లో 'ప్లాట్‌ఫాం ఎక్కని బస్సులు.. అవస్థలు పడుతున్న ప్రయాణికులు, అద్దెలు చెల్లించలేక రోదిస్తున్న బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు అంటూ ప్రత్యేక కథనం ప్రచురించడంతో ఆర్టీసీ అధికారులలో కదలిక వచ్చింది. రెండ్రోజులు బస్టాండ్‌లోని చిన్నచిన్న పనులను కూలీలతో పూర్తి చేశారు. మానుకోట డిపో మేనేజర్ శివప్రసాద్ గురువారం మరిపెడ బస్టాండ్‌కు చేరుకొని గంటలపాటు అక్కడే ఉండి రేపు (శనివారం) ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన ప్లాట్‌ఫాంను ప్రారంభించి బస్సులను ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చేలా అన్ని రకాల చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం స్టీల్ చైర్లు తెప్పిస్తున్నారు. శుక్రవారం వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఎం ఆర్టీసీ సిబ్బందిని ఆదేశించి వెళ్లారు.

కన్నుల పండువగా అయ్యప్పస్వామి నగర సంకీర్తన



అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో నిప్పులపై నడుస్తున్న అయ్యప్పస్వామి భక్తుడు



మానుకోట పట్టణంలో అయ్యప్పస్వామి నగర సంకీర్తన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం ఆలయ ప్రధాన అర్చకులు మాధవన్ నంబూద్రి వేదమంత్రోచ్చరణల నడుమ ఉదయం గణపతిహోమం, కలషపూజ, అభిషేకములు, పుష్పాలంకరణ, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం సామూహిక అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలపూజ ముగింపు కార్యక్రమంలో భాగంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పట్టణ పురవీధుల్లో అయ్యప్పస్వాములు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించగా స్థానిక శాసనసభ్యులు భూక్య మురళీనాయక్ పాల్గొన్నారు. నగర సంకీర్తనలో ఆలపించిన అయ్యప్ప గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుస్వాములు గద్దె రవి, గుడిబోయిన రాంచంద్రయ్య, ఎడ్ల రమేష్, మస్తాన్‌రెడ్డి, పోతురాజు, బెల్లంకొండ శ్రీనివాస్, గణేష్, నాళ్ల నర్సింహరావు స్వాములు పాల్గొన్నారు.

నిప్పులపై నడిచిన అయ్యప్పస్వాములు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం రాత్రి అయ్యప్ప మాలధారణ గావించిన స్వాములు నిప్పులపై నడిచి భక్తిని చాటుకున్నారు. అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మాధవన్ నంబూద్రి వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలదారులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది అయ్యప్ప మాలధారణ గావించిన స్వాములే కాకుండా సివిల్ స్వాములు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబాబాద్‌లో గురుస్వాములతో పాటు కన్నెస్వాములు, చిన్నారి స్వాములు కూడా నిప్పులపై నడిచారు.

'విప్లవ పార్టీలు ఏకం కావాలి'

డోర్నకల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పెరిగిపోతున్న నియంతత్వ ధోరణి వల్ల ప్రజాస్వామ్య హక్కులకు భంగం వాటిల్లుతుందని న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న అన్నారు. మండలంలోని వెన్నారంలో గురువారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ విజయవంతం చేయాలని కోరుతూ.. పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్డీ విలీన పార్టీ మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. భూమి కోసం... భుక్తి కోసం.. పేదల హక్కుల కోసం పోరాడిన ఎందరో అమరులయ్యారని చెప్పారు. దేశంలో కమ్యూనిస్టుల ద్వారానే ప్రజా, భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు నున్న ఉపేందర్, చింతల సత్యం, చిన్నం వెంకన్న, నాగుబండి శంకర్‌రావు, మైలవరపు భాస్కర్, చింతల వాసయ్య, శాతరాజుపల్లి మల్లయ్య, చిక్క పూర్ణయ్య, కృష్ణ, నర్సింహారావు, వెంకటేష్, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.

విప్లవకారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలు బలోపేతం

కురవి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విప్లవకారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలు బలోపేతమవుతాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హెచ్.లింగ్యా అన్నారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు విప్లవ పార్టీల విలీన సభ పోస్టర్లను గురువారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చారీ హరీష్, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, బిక్షం, కోడి నర్సయ్య, వీరన్న, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మానుకోటలో నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య ఆధ్వర్యంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కేక్‌ను కట్ చేసి, పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. అనంతరంఅన్నదాన కార్యకార్యమాన్ని ప్రారంభించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, దేవరం ప్రకాశ్‌రెడ్డి, నీరుటి లక్ష్మీనారాయణ, బండి శ్రీనివాస్, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, అంబటి వీరభద్రం పాల్గొన్నారు.

- మానుకోటలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు గుగులోతు వంశీనాయక్, బయ్యారం పీఏసీఎస్ డైరెక్టర్ జూలకంటి సీతారాంరెడ్డి, షేక్. రియాజ్ అన్సారీ, ఇస్లావత్ రమేష్, ముజ్జు, సిద్దు, విక్రమ్, ఫరూక్, సతీష్, గోపాల్, ఇంతియాజ్, హస్సన్, బాబీ, అరిఫ్ పాల్గొన్నారు.
- కేసముద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మురళీనాయక్ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, దయాకర్, అయూబ్‌ఖాన్, రావుల మురళి, ధరావత్ బాలు పాల్గొన్నారు. కల్వలలో గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, కేసముద్రంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలెపాక శంకర్ ఆధ్వర్యంలో వేం నరేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేశారు.
- ఇనుగుర్తిలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరెళ్లి సతీష్, చిన్నాల కట్టయ్య, కొట్టం రాము, మామిడి జనార్ధన్, బాబురావు, నారాయణ, మురళి, గండు అజయ్, నాగెళ్లి సుధీర్, కవిత పాల్గొన్నారు.
- నెల్లికుదురులో ఎమ్మెల్యే మురళీనాయక్ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్ ఎదళ్ల యాదవరెడ్డి, హెచ్ వెంకటేశ్వర్లు, ఎదళ్ల వెంకట్‌రెడ్డి, రత్నపురం యాకయ్య, సట్ల యాకయ్య, కొమురెల్లి, నర్సయ్య వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.
- గార్లలో మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, నాయకులు యాకుబ్ పాషా, గుగులోత్ శ్రీనివాస్, బానోత్ హాతీరాం నాయక్, ఉపేందర్, జానీ, రమేష్, గందసిరి వీరన్న పాల్గొన్నారు.
- కురవిలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, మానుకోట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుధాకర్, బాలగాని శ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, గొల్లపల్లి రజినీకాంత్,వద్దుల సురేందర్‌రెడ్డి, తుకారంనాయక్, డాక్టర్ శరత్, చిన్నం గణేష్, దైద భద్రయ్య, సక్రు, కావిండ్ల వీరన్న పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్డీ జిల్లా సహాయ కార్యదర్శి మదార్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో ఎన్డీ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.మదార్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర సదస్సు జయప్రదం కోసం ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రివిజనిజానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనేక సంవత్సరాలుగా అంతర్గతంగా పోరాడుతూ.. వస్తుందన్నారు. ఈ క్రమంలో విప్లవకారులుగా నటిస్తూ లోపల రివిజినిస్టు భావాలను ప్రదర్శిస్తూ సోకాల్డు విప్లవకారులుగా కొందరు చలమణి అవుతున్నారని, ఇలాంటి విప్లవకారులను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఎస్‌కె.బాబన్న, ఉపేందర్, భాస్కర్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.



తొర్రూరులో మాట్లాడుతున్న పాడియబీకు

సమ్మెను విజయవంతం చేయాలి

- ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాడియబీకు

తొర్రూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధ హెచ్-106) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పాడియబీకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టీయూసీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్న 60 వేల మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12వేల జీపీల్లో పారిశుధ్యం పనులు చేస్తూ ప్రజల ప్రాణాలకుఅండగా ఉంటున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన టోకెన్ సమ్మెకు కార్మికులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, నాయకులు యాకయ్య, శివ, రవీందర్, బాలు, మహేష్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

గార్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం గార్లలో ఘనంగా జరిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ పార్టీ జెండాను ఎగర వేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ దేశంలో ఎన్నో పోరాటాలకు స్ఫూర్తి దాయకంగా నిలిచిందన్నారు. దేశంలో పాలక వర్గాల చేతుల్లో ప్రజలు అణిచివేతకు వ్యతిరేకంగా సీపీఐ అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాగం లోకేష్, నాగరాజు, సక్రు, దూపాటి జనార్ధన్, సరిత, పిచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్

అనారోగ్యంతో కారోబార్ మృతి



పెద్దవంగర, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధడుతూ కారోబార్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పరగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కారోబార్ బైన రవి కుమార్ (36) కొద్ది సంవత్సరాలుగా కారోబార్‌గా పని చేస్తున్నాడు. కొద్ది కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ప్రవళిక, కుమార్తె, కుమారుడు అన్నారు. మృతుడి కుటుంబానికి తహసీల్దార్, జీపీ ప్రత్యేకాధికారి వీరగంటి మహేందర్ సహకారంతో పంచాయతీ కార్యదర్శి హేమలత రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక నాయకులు, సీఐటీయూ మండల అధ్యక్షుడు కసరబోయిన కుమారస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

5న చలో మానుకోటను సక్సెస్ చేయండి

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నెహ్రూసెంటర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో జనవరి 5న జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన చలో మానుకోటను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీల మాతృ భాష అయినా గోర్‌బోలీని గుర్తించి రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్, కౌన్సిలర్ శ్రీను, నాయకులు బాలాజీ, హత్తిరాం, బాదావత్ బిక్షం, దారావత్ రమేష్, రాజేందర్, మునేష్, రాంబాబు పాల్గొన్నారు.

అవస్థలు పడుతున్న మైనార్టీ కాలనీ వాసులు : సీపీఎం

మరిపెడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మైనార్టీ కాలనీ వాసులు అనేక అవస్థలు పడుతున్న మునిసిపల్ అధికారులకు గింత పట్టింపులేదని సీపీఎం మరిపెడ పట్టణ బాధ్యుడు దొంతు సోమన్న మండిపడ్డారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మైనార్టీ కాలనీ వాసుల సమస్యలపై ఆందోళన నిర్వహించారు. సోమన్న హాజరై మాట్లాడారు. పక్షం రోజుల నుంచి తాగు నీటి సరఫరా చేస్తలేదన్నారు. డ్రైనేజీ, రోడ్ల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. ఆ కాలనీ వాసులు యాకూబ్, రహీం, శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



టీఎస్-యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి యాకూబ్

'రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి యాకూబ్ అన్నారు. మహబూబాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర 6వ విద్యావైజ్ఞానిక మహాసభలలో 'అధ్యాపనం-సామాజిక స్పృహ లక్ష్యం' తో 'హక్కులు-బాధ్యతలు' మొదలగు అంశాలపై విద్యాసదస్సు ఉంటుందన్నారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి నిర్మాణ మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు ముఖ్యఅతిదులుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుకేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, పాఠశాల విద్యడైరెక్టర్ ఇ.వి.నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు, డాక్టర్. కె.శ్రీనివాస్, కుమారి అయిషీఘోష్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రవీణ్‌కుమార్, కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, మంజుల, శైలజ, భరత్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

రూ.4 వేల పింఛను ఇవ్వాలి 'దేవుడా'.!

- కేసముద్రం స్టేషన్‌లో వేం నరేందర్‌రెడ్డి చిత్రపటానికి మహిళ దండాలు



కేసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ ప్రకటించిన రూ.4 వేల పింఛను ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి చిత్రపటానికి ఓ మహిళ దండాలు పెట్టింది. కేసముద్రం స్టేషన్ పొట్టిశ్రీరాములు సెంటర్‌లో గురువారం వేంనరేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటంతో పార్టీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అటుగా వెళుతున్న ఉప్పరపల్లికి చెందిన అల్లం ఉప్పమ్మ ఫ్లెక్సీ వద్ద ఆగినరేందర్‌రెడ్డి చిత్రపటానికి దండాలు పెడుతూ 'రూ.4 వేల పింఛను ఇవ్వాలి, మీరు మా దేవుడు సారూ' అనడం పలువురు పార్టీ కార్యకర్తలను ఆకర్షించింది.


సమస్యల పరిష్కారానికి ఒత్తిడి పెంచాలి

- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి



ఎమ్మెల్సీ రవీందర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరి అన్నారు. శాసన మండలిలో రేషన్ డీలర్ల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావును మహబూబాబాద్‌లో రేషన్ డీలర్లు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం సర్కార్ చొరవ చూపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా, నెలకు గౌరవవేతనం రూ.5 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బిర్రు వెంకటనారాయణ, ముంజల యాకయ్య, గొర్రె వెంకన్న, రాంచందర్‌రావు, శ్రీను, వేణుగోపాల్, సురుగు వెంకన్న, పులి సోమయ్య, సుధాకర్, సత్తన్న, భాస్కర్, కిషన్, గురులింగం తదితరులు పాల్గొన్నారు.



రమణయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

'నున్న రమణయ్య ఆశయాలు నేరవేర్చాలి'

డోర్నకల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం పార్టీ దివంగత నాయకులు నున్న రమణయ్య ఆశయాలను నేరవేర్చే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. డోర్నకల్ మండలం తహసీల్దార్ బంజరలో నున్న రమణయ్య ప్రథమ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి ప్రతిభ ఉన్న కబడ్డీ క్రీడాకారుడిగా రమణయ్య రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందినట్లు గుర్తు చేశారు. రమణయ్య యువతకు స్ఫూర్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వర్‌రావు, నాయకులు బండి పద్మ, బండి రమేష్, ఎర్ర శ్రీకాంత్, విక్రమ్, భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, గునిగంటి రాజన్న, ఉప్పనపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి కృష్ణ, బషీరుద్దీన్, నవీన్‌రెడ్డి, బొమ్మన అశోక్‌కుమార్, నున్న అప్పారావు, ఎన్డీ నాయకులు యాస వెంకటనారాయణ, కర్న చిలకారెడ్డి, యాస భాస్కర్ పాల్గొన్నారు.